క్లుప్తంగా

రోగికి ఆక్సిజన్ మెషీన్ అందజేత

అమలాపురం టౌన్: అమలాపురం రూరల్ మండలం పేరూరు గ్రామంలో అనారోగ్యంతో బాధ పడుతున్న ఓ వ్యక్తికి ఊపిరి సమస్య తలెత్తడంతో విశ్వ హిందూ పరిషత్, భజరంగ దళ్ ప్రతినిధులు ఉచితంగా ఆక్సిజన్ మెషీన్‌ను శుక్రవారం అందజేశారు. పేదరికంతో ఇంటి వద్దే ఊపిరి పీల్చుకోవడంలో ఇబ్బంది పడుతున్న రోగి పరిస్థితిని గమనించి ఆ రెండు సంస్థల ప్రతినిధులు స్పందించి వారే రోగి ఇంటికి వెళ్లి ఆక్సిజన్ మెషీన్‌ను అందించారు. భజరంగ దళ్ రాష్ట్ర సహ ప్రముఖ్ శిరంగు నాయుడు ఆధ్వర్యంలో ప్రతినిధులు పాల్గొన్నారు.

దేవస్థానాల చైర్మన్ల రాజీనామా

అమలాపురం టౌన్: ప్రభుత్వం మారడంతో నైతిక బాధ్యత వహిస్తూ అమలాపురంలోని వేంకటేశ్వరస్వామి, చెన్న మల్లేశ్వరస్వామి దేవస్థానాల చైర్మన్లు రాజీనామాలు చేశారు. వేంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి తన రాజీనామా పత్రాన్ని దేవస్థానం ఈఓ దూనబోయిన సాయిబాబుకు శుక్రవారం అందజేశారు. దేవస్థానాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశానన్న సంతృప్తితో ఉన్నానని ఆమె అన్నారు. ప్రసాదం, అన్నదానం వంటి విషయంలో నాణ్యతను పెంచి దేవస్థానానికి భక్తుల రాకను మరింత పెంచానన్నారు. అలాగే పట్టణంలోని చెన్న మల్లేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ కల్వకొలను రామకృష్ణ (బాబి) కూడా ఇప్పటికే తన పదవికి రాజీనామా చేశారు. చైర్మన్ పదవులు ఇచ్చి, ఆ దేవస్థానాల అభివృద్ధికి పాటుపడేలా అవకాశం కల్పించిన మాజీ మంత్రి పినిపే విశ్వరూప్‌కు విరీతాదేవి, బాబి కృతజ్ఞతలు తెలిపారు.

ఫ్రీజర్ బాగు చేయించాలి

యానాం: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ విభాగంలో మృతదేహాలను భద్రపరిచే ఫ్రీజర్ బాక్స్ వినియోగంలో లేక మృతుల బంధువులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు అన్నారు. దీనికి తక్షణం మరమ్మతులు చేయించాలని శుక్రవారం ఆయన అధికారులను కోరారు. ఫ్రీజర్ బాక్స్ నెలల తరబడి పనిచేయడం లేదని, దీంతో మృతుని బంధువులు ఐస్‌కేన్‌లు తెచ్చుకుని మృతదేహాలను ఉంచుతున్నారన్నారు. కనీస సౌకర్యాలు కల్పించాల్సిన జీజీహెచ్ పాలనా విభాగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ఈ సమస్యపై పుదుచ్చేరి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ఎంపీ హరీష్‌కు సత్కారం



ఎంపీ హరీష్ మాధుర్‌ను అభినందిస్తున్న చాంబర్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఎంపీ గంటి హరీష్ మాధుర్‌ను చాంబర్ ఆఫ్ కామర్స్‌కు చెందిన పలు వ్యాపార సంఘాల ప్రతినిధులు శుక్రవారం సత్కరించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ వ్యవస్థాపకుడు గోకరకొండ హరిబాబు, చాంబర్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, కార్యదర్శి కొమ్మూరు వెంకటాచలప్రసాద్, కోశాధికారి దొమ్మేటి సాయిబాబు ఆధ్వర్యంలో ఈ అభినందన కార్యక్రమం జరిగింది. చాంబర్ ఉపాధ్యక్షుడు మోకా వెంకట సుబ్బారావు, బులియన్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడిచర్ల త్రిమూర్తులు, ప్రతినిధులు రాయుడు నాని, చింతలపూడి సత్తిబాబు, అనుపోజు శ్రీను, ద్వారంపూడి సత్యనారాయణరెడ్డి, నంబూరి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బిల్ కలెక్టర్ మృతికి సంతాపం

అల్లవరం: అల్లవరం పంచాయతీలో బిల్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న కొపనాతి సూర్యవంశపురాజు (58) గురువారం రాత్రి ఓడలరేవులోని తన నివాసంలో గుండెపోటుతో మృతి చెందారు. అతని మృతదేహాన్ని ఎంపీ హరీష్‌మాధుర్ సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. రాజు మృతికి ఎంపీడీఓ కృష్ణమోహన్, సర్పంచ్ బొమ్మి బాలవేణి, కార్యదర్శి రాజమోహన్ తదితరులు సంతాపం తెలిపారు.

భూముల కౌలు వేలం వాయిదా

తాళ్లరేవు: కేశవపురం గ్రామంలో కేశవస్వామివారి దేవస్థానం భూముల కౌలుకు సంబంధించి శుక్రవారం నిర్వహించిన బహిరంగ వేలం పాటను మరోసారి వాయిదా వేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి యర్రా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సుమారు 102.27 ఎకరాల భూముల్లో సాగుకు గురువారం బహిరంగ వేలం పాట నిర్వహించగా, రైతులెవరూ రాకపోవడంతో మరోసారి ఏర్పాటు చేశారు. మళ్లీ ఎవరూ హాజరు కాకపోవడంతో మళ్లీ వాయిదా వేశారు.

బీటెక్‌లో ప్రవేశానికి అడ్మిషన్లు

యానాం: పాలిటెక్నిక్ విద్యను అభ్యసించిన విద్యార్థులు లేటరల్ ఎంట్రీ పద్ధతి ద్వారా రెండో ఏడాది బీటెక్ విద్యను అభ్యసించేందుకు పుదుచ్చేరి సెంటాక్ దరఖాస్తులు ఆహ్వానిస్తుందని సెంటాక్ సంస్థ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా సెంటాక్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఈ నెల 26 లోగా పంపాలని కోరింది. ఎస్సీ, ఎస్టీ, వికలాంగ విద్యార్థులకు రూ.500, ఇతర కేటగిరీలకు రూ.వెయ్యి దరఖాస్తు ఫీజు ఉంటుందన్నారు. పుదుచ్చేరిలో రెండు ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో మొత్తం 334 లేటరల్ ఎంట్రీ సీట్లు ఉన్నాయన్నారు. విదేశీయులు సైతం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ముందుకు సాగుదాం..

- ఖరీఫ్‌కు సర్వం సన్నద్ధం
- అందుబాటులో విత్తనాలు, ఎరువులు
- రైతు భరోసా కేంద్రాల్లో పంపిణీకి సిద్ధం



తాళ్లరేవు రైతు భరోసా కేంద్రంలో పంపిణీకి సిద్ధంగా ఉన్న వరి విత్తనాలు



ఉప్పంగల రైతు భరోసా కేంద్రంలో ఎరువుల బస్తాలు

తాళ్లరేవు: పచ్చని సిరులు కురిపించేందుకు రైతన్నలు పొలాల పట్టారు.. కొంగొత్త ఆశలతో ఖరీఫ్ వైపు సాగుతున్నారు. దీనికి గాను అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులను రాయితీలపై అందించేందుకు అన్ని చర్యలూ తీసుకుంది. ఈ మేరకు అన్ని రైతు భరోసా కేంద్రాల్లో వాటిని అందుబాటులో ఉంచింది. అంతేకాకుండా రైతులకు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందిస్తూ, సాగులో మెళకువలను నేర్పుతూ అధిక దిగుబడులు సాగించే విధంగా వ్యవసాయ సిబ్బంది చర్యలు చేపడుతున్నారు. ఏ విత్తనాలు వాడాలని చెబుతూనే, ఏ ఎరువులు ఎంత కావాలనే సమాచారాన్ని రైతుల నుంచి తీసుకుని వాటిని సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ ఏడాది నిర్ణీత సమయానికే కాలువల నుంచి సాగునీటిని విడుదల చేయడం, నైరుతి రుతు పవనాల రాకతో ఖరీఫ్ పనులు ఊపందుకున్నాయి. దీంతో రైతులకు సహకారం అందించేందుకు వ్యవసాయ శాఖ సమాయత్తం అవుతోంది.

పంపిణీకి సిద్ధంగా విత్తనాలు

ఖరీఫ్ సాగు ప్రారంభం కావడంతో రైతులకు రాయితీపై విత్తనాలు అందించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే వరి విత్తనాలను రైతు భరోసా కేంద్రాలకు (ఆర్బీకేలు) చేరవేశారు. ఈ ప్రాంత నేల స్వభావానికి అనువైన రకాలను ఎంపిక చేసి విత్తనాలను రప్పించారు. తాళ్లరేవు మండలానికి సుమారు 150 మెట్రిక్ టన్నుల వరి విత్తనాలు, సుమారు 100 మెట్రిక్ టన్నుల ఎరువులను అందుబాటులో ఉంచారు. రైతులు అధికంగా సాగు చేసే ఎంటీయూ 7,029 (స్వర్ణ) 92.5 క్వింటాళ్లు, ఎంటీయూ 1,318 రకం 45 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయి. ఎంటీయూ 7,029 రకం, ఎంటీయూ 1,318 రకాల విత్తనాలు 30 కిలోల బస్తా రూ.1,194 కాగా రూ.150 రాయితీపై రైతులకు రూ.1044కి విక్రయిస్తున్నామని వ్యవసాయ అధికారులు వివరిస్తున్నారు.

రాయితీపై విత్తనాలు



నేల స్వభావం, వాతావరణ పరిస్థితులకు తగిన విధంగా రైతుల అవసరాలకు అనుగుణంగా వరి విత్తనాల ఇండెంట్ పెట్టాం. అన్ని రైతు భరోసా కేంద్రాల్లో వరి విత్తనాలు రాయితీపై ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నాం. వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది సూచనలతో రైతులు అవగాహన పెంచుకుని వరి నారుమళ్లు వేసుకోవడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చు.

– ఎస్.ప్రశాంతి, మండల వ్యవసాయ అధికారి, తాళ్లరేవు

ఎంపీటీసీ సభ్యురాలికి ఓదార్పు



గోవలంక ఎంపీటీసీ సభ్యురాలు భీమాబాయిని పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తాళ్లరేవు: గోవలంక ఎంపీటీసీ సభ్యురాలు మోర్త భీమాబాయి కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ నాయకులు శుక్రవారం పరామర్శించారు. ఇటీవల గ్రామానికి చెందిన టీడీపీ శ్రేణులు కొందరు ఎంపీటీసీ ఇంటిపై దాడి చేసి, వస్తువులను ధ్వంసం చేసి భయభ్రాంతులకు గురిచేశారు. ఈ నేపథ్యంలో జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి శామ్యూల్‌సాగర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కాదా గోవింద కుమార్ తదితర నాయకులు, ఎంపీటీసీ సభ్యులు ఆమె ఇంటికి వెళ్లి ధైర్యం చెప్పారు. తామంతా అండగా ఉంటామని, భయపడాల్సిన పనిలేదని భరోసా ఇచ్చారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై చేసిన దాడులను వారు ఖండించారు. అలాగే కో ఆప్షన్ సభ్యుడు కూరాటి శ్రీకృష్ణ, దడాల సాల్మన్ రాజు, కూరాటి వాసులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో కొపనాతి నాగరాజు, కోరుకొండ చంటి, దున్నా శ్రీకాంత్, నీలపాల శ్రీను, మట్టా లింగమూర్తి, పలివెల శేషారావు, ఎంపీటీసీ సభ్యులు యర్రంనీడి అప్పారావు, పోతుల రత్నకుమారి, రేకాడి వెంకటేశ్వర్లు, చెక్కా కామేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఆధార్ అనుసంధానం చేయించుకోవాలి

ముమ్మిడివరం: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ రాని విద్యార్థుల వివరాలను ప్రభుత్వ పరీక్షల కార్యాలయ వెబ్‌సైట్లో ఉంచామని ఎగ్జామినేషన్ బోర్డు అసిస్టెంట్ కమిషనర్ నక్కా సురేష్ తెలిపారు. 2019 నుంచి 2022 వరకూ నేషనల్ స్కాలర్‌షిప్ పరీక్షల్లో ఎంపికై ప్రస్తుతం 9, 10, 11, 12 తరగతుల్లో ఉన్న విద్యార్థులకు స్కాలర్ షిప్ కోసం వారి ఆధార్‌ను బ్యాంకు ఖాతాలకు అనుసంధానం చేయాలన్నారు. ఇది చేయని కొంతమందికి స్కాలర్‌షిప్ జమ కాలేదని, ఆ వివరాలను ప్రభుత్వ పరీక్షల కార్యాలయ వెబ్‌సైట్‌లో ఉంచామని తెలిపారు. జాబితాలో పేరున్న ప్రతి విద్యార్థి వెంటనే తమ బ్యాంకు అకౌంట్‌కు ఆధార్ అనుసంధానం చేయించుకోవాలని ఆయన సూచించారు.

కోర్టు సమస్యలు పరిష్కరించాలని వినతి



సీఎం రంగసామికి వినతిపత్రం అందజేస్తున్న సీనియర్ న్యాయవాది కమిడి విజయకుమార్

యానాం: యానాంలో శిథిలావస్థకు చేరిన కోర్టు భవనం, తదితర సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం సీఎం రంగసామికి సీనియర్ న్యాయవాది, పూర్వపు ఏపీపీ, యానాం అడ్వకేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి కమిడి విజయకుమార్ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రెంచ్ కాలంలో నిర్మించిన కోర్టు భవనం శిథిలావస్థకు చేయడంతో నివాసానికి యోగ్యం కాదని, ఇప్పటికే జేఎన్‌టీయూ కాకినాడ పరిశీలించి పీడబ్ల్యూడీ శాఖకు నివేదిక ఇచ్చిందన్నారు. వర్షం వస్తే స్లాబ్ నుంచి నీరు వచ్చి పూర్తిగా నిండిపోతుందని, కోర్టు కార్యకలాపాలన్నీ శిథిలమైన భవనంలోనే భయాందోళనల మధ్య జరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం రుతుపవనాల నేపథ్యంలో వర్షాలు వచ్చే అవకాశం ఉందని, భవనం మరింత ప్రమాదకరంగా మారుతుందన్నారు. తక్షణం కొత్త భవనాన్ని నిర్మించాలని కోరారు. ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు యానాం రీజియన్‌కు మంజూరైందని, కాని ప్రారంభం కాలేదన్నారు. మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు నుంచి అప్‌గ్రేడ్ అయ్యి సబ్ ఆర్డినేట్ కమ్ అసిస్టెంట్ సెషన్ కోర్టుగా మారిందన్నారు. ఒకే జడ్జి రెండు కోర్టులైన జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టును, సబ్ ఆర్డినేట్ కోర్టును సైతం విచారించాల్సి వస్తుందన్నారు. రాజ్యాంగం పేర్కొన్న విధంగా డిస్ట్రిక్ట్ మున్సిఫ్ కమ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టును నెలకొల్పడం ద్వారా బార్ అసోసియేషన్ న్యాయవాదులు, ప్రజలు హర్షిస్తారన్నారు. అదేవిధంగా మంత్రి లక్ష్మీనారాయణకు సైతం వినతిపత్రం అందించారు.

ఎమ్మెల్యే ఆనందరావుకు అభినందన



ఎమ్మెల్యే ఆనందరావును సత్కరిస్తున్న కొంకాపల్లి ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురం ఎమ్మెల్యేగా విజయం సాధించిన అయితాబత్తుల ఆనందరావును పట్టణంలోని కొంకాపల్లికి చెందిన జనసేన నాయకులు, కార్యకర్తలు స్థానిక ఎంపీ కార్యాలయంలో శుక్రవారం అభినందించారు. పేరూరు ఎంపీటీసీ సభ్యుడు పనసా బుజ్జి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పనసా అబ్బు, పేరూరు పంచాయతీ సభ్యులు కురసాల వీరబాబు, దూలం బుజ్జి, తిక్కా సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

నాయకుల సత్కారం

అమలాపురం రూరల్: ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావును కూటమి నాయకులు అభినందించారు. అమలాపురంలోని క్యాంప్ కార్యాలయంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడ సోంబాబు, ఎంపీపీ ఈశ్వరరావు, మాజీ కౌన్సిలర్ దున్నాల దుర్గ, జనసేన నాయకుడు బండారు వెంకన్నబాబు తదితరులు కలసి ఎమ్మెల్యేను సత్కరించారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు సంతకంపై హర్షం

ముమ్మిడివరం: ల్యాండ్ టైట్లింగ్ యాక్టును రద్దు చేసేందుకు సీఎం చంద్రబాబు సంతకం చేయడంపై న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి సత్యనారాయణ అధ్యక్షతన శుక్రవారం న్యాయవాదుల సమావేశం జరిగింది. సమావేశంలో మట్టపర్తి వెంకటేశ్వరరావు, రామాయణం మన్నేశ్వరరావు, గంటి శ్రీధర్‌బాబు, పలివెల నరేష్, కుమార్, గోనమండ వెంకటేశ్వరరావు, జీవీవీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

జిప్‌మెర్ వైద్య సేవలు విస్తరించాలి

యానాం: ఇటీవల యానాంలో ప్రారంభమైన జిప్‌మెర్ ఆసుపత్రిలో సేవలను విస్తరించాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ కోరారు. శుక్రవారం రోగులకు అందుతున్న వైద్య సేవలు తదితరమైన వాటిపై జిప్‌మెర్ వైద్యులు, అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో దీర్ఘకాలిక, అత్యవసర చికిత్సలు సైతం అందక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో పూర్తి స్థాయిలో సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం ఓపీడీ విభాగంలో నలుగురు వైద్యులు అందుబాటులో ఉన్నారని, రోజూ 150 మందికి వస్తున్నారన్నారన్నారు. అందరికీ వైద్య సేవలు అందిస్తున్నట్లు జిప్‌మెర్ ఇన్‌చార్జి ఆనందరాజ్ తెలిపారు.

యానాం యువకుడి ప్రతిభ



సాహస విన్యాసం చేసిన కృష్ణకుమార్

యానాం: హిమాచల్ ప్రదేశ్‌లోని మనాలి నుంచి హంప్టా పాస్ వరకూ ఉన్న దుర్భేద్యమైన హిమాలయ పర్వత, అటవీ ప్రాంతంపై యానాం ప్రాంతానికి చెందిన యువకుడు దవులూరి కృష్ణకుమార్ సాహస విన్యాసం చేశాడు. సుమారు 14 వేల ఎత్తుల అడుగులో ట్రెక్కింగ్ నిర్వహించి శుక్రవారం అందరి ప్రశంసలను అందుకున్నారు. అడ్వంచర్ స్పోర్ట్స్ హంపాస్ కైలాసగిరి ట్రెక్స్ ప్రభుత్వ సంస్థ ఆధ్వర్యంలో సుమారు 6 రోజుల పాటు మనాలి నుంచి ప్రారంభమైన ట్రెక్ బంజరు భూముల నుంచి అడవుల వరకూ వివిధ భాగాల నుంచి ఇది ప్రారంభమయ్యిందని కృష్ణకుమార్ విలేకరులకు తెలిపారు. తన బృందంతో ప్రయాణం ఉత్కంఠ కలిగించిందని, సాహసోపేతమైన అనుభూతిని ఇచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు. కృష్ణకుమార్ తండ్రి దవులూరి బులివీరాస్వామి భారత సైన్యంలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు.

ఇమామ్ బాకర్‌కు నిండుశోకంతో నివాళి



ఊరేగింపులో పాల్గొన్న ముస్లింలు

మామిడికుదురు: ముస్లిం ఆరాధ్య దైవం అయిదో ప్రవక్త హజరత్ ఇమామ్ మహ్మద్ బాఖర్‌కు ముస్లింలు శుక్రవారం నిండు శోకంతో నివాళులర్పించారు. దీనిలో భాగంగా నగరం గ్రామంలోని బార్గాహే పంజతన్‌లో మజ్లిస్ జరిగింది. మత ప్రబోధకుడు సయ్యద్ అబ్బాస్ బాఖరి మజ్లిస్ ఆలపించారు. ఇమామ్ బాకర్ జీవిత చరిత్రలోని ముఖ్య ఘట్టాలను, అతని గొప్పతనాన్ని భక్తులకు వివరించారు. మీర్ జుల్ఫీకర్ అలీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. అనంతరం పంజా నుంచి గుమ్మటాన్ని తీసి ఊరేగించారు. గుండెలు బాదుకుంటూ మాతం నిర్వహించారు. దీంతోపాటు మంజిలే కర్బలాలో కూడా మజ్లిస్ జరిగింది.

అంతర్వేది స్వామివారి సన్నిధిలో ఆర్డీఓ



అంతర్వేది లక్ష్మీనృసింహుని సన్నిధిలో ఆర్డీఓ కేశవవర్ధన్‌రెడ్డి

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో శుక్రవారం అమలాపురం ఆర్డీఓ జి.కేశవ వర్ధన్‌రెడ్డి, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు ఆలయ మర్యాదలతో ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేదపండితుడు చింతా వేంకటశాస్త్రి స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు పలికారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని ఆలయ సిబ్బంది అందజేశారు. రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ వి.రామరాజు, వీఆర్వో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ హితమే అభిమతం కావాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీఈఓ కమలకుమారి

ఐ.పోలవరం: పర్యావరణ హితమే అందరి అభిమతం కావాలని, ప్లాస్టిక్ వాడకాన్ని వీడాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.కమలకుమారి, డిప్యూటీ కలెక్టర్, సమగ్ర శిక్ష అదనపు కో ఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి, పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష మేరీ లైఫ్ కార్యక్రమంలో భాగంగా ఐ.పోలవరం మండలం జి.వేమవరం జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం సలాది వెంకటనారాయణ అధ్యక్షతన శుక్రవారం ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమలకుమారి, మధుసూదనరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉంటూ పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్లాస్టిక్ సంచుల వాడకాన్ని వదిలేయడం ద్వారా కాలుష్యాన్ని నివారించవచ్చన్నారు. రీసైక్లింగ్ ప్రాసెస్‌కు అనుగుణంగా ప్రతి ఒక్కరూ డస్ట్ బిన్లలో ప్లాస్టిక్ వస్తువులను వేయాలని సూచించారు. పొరపాటున వాటిని విసిరేస్తే భూమిలో కలిసేందుకు 20 నుంచి ఐదు వందల ఏళ్లు పడుతుందన్నారు. అమలాపురం ఉప విద్యాశాఖ అధికారి గుబ్బల సూర్యప్రకాశరావు, సమగ్ర శిక్ష ఎఫ్ఏఓ జి.ప్రవీణ్‌కుమార్, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, సమగ్ర శిక్ష సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం, ఏఎల్ఎస్ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ డి.రమేష్‌బాబు, ఏఎంఓ పి.రాంబాబు, ఏపీఓ డాక్టర్ ఎంఏకే భీమారావు, ఐఈ కో ఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ, మండల విద్యాశాఖ అధికారులు నల్లమిల్లి కొండారెడ్డి, కె.తిరుమలరావు తదితరులు పర్యావరణ ప్రాధాన్యం, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం జిల్లా స్థాయి పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పర్యావరణ పరిరక్షణ మన బాధ్యత అనే అంశంపై జిల్లా అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలసి ర్యాలీ నిర్వహించారు. సర్పంచులు నల్లా సుదర్శనరావు, లంకలపల్లి బుల్లియ్య, ఎంపీటీసీ సభ్యుడు లంకలపల్లి దుర్గారాణీజమ్మి, జిల్లా రిసోర్స్ పర్సన్లు కుందుర్తి వీర వెంకటరావు, వెంకట్రావు, వరద శ్రీనివాస్, గ్రామ పెద్దలు పెంటావరపి కొండమూరి విజయబాబు, ముంగి కృష్ణ, కోల భద్రం, మద్దింశెట్టి పురుషోత్తం, ఇండుగుల రాము తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగం అభివృద్ధే ధ్యేయం



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఎమ్మెల్యే అశోక్, ఆర్ఏఓ మునిస్వామి

యానాం: యానాం నియోజకవర్గంలో విద్యారంగం అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని, దీనికి ఉపాధ్యాయులు సహకరించి మెరుగైన ఫలితాలు తీసుకురావాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ అన్నారు. శుక్రవారం స్థానిక రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఇంగ్లిషు మీడియం హైస్కూల్‌లో నూతన విద్యా సంవత్సరానికి ప్రభుత్వం మంజూరు చేసిన పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు అందజేసే కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పుదుచ్చేరి ప్రభుత్వం 1 నుంచి 10వ తరగతి వరకూ పూర్తి స్థాయిలో సీబీఎస్ఈ కరిక్యులమ్‌ను ప్రవేశపెట్టిందన్నారు. విద్యార్థులకు నూతన విద్యా ప్రణాళిక అర్థమయ్యే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం సీబీఎస్ఈ పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. గత విద్యా సంవత్సరంలో విశేష ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఆయన సత్కరించారు. కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్, ఎస్ఎస్ఏ ఏడీపీసీ కమిడి ప్రభాకరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్తదానం ఎంతో ఉత్తమం



కిమ్స్‌లో రక్తదానం చేస్తున్న వైద్యులు, విద్యార్థులు



ఎస్.యానంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ అన్నపూర్ణ

అమలాపురం రూరల్: రక్తదానం చేయడం ఎంతో ఉత్తమమని అమలాపురం కిమ్స్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బారావు పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని కిమ్స్ ఆసుపత్రిలో విద్యార్థులతో రక్తదాన శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేసి ప్రతి ఒక్కరూ ప్రాణదాతలుగా నిలవాలన్నారు. కిమ్స్‌లో వైద్య కళాశాల విద్యార్థులు రక్తదానం చేశారన్నారు. వారిని సూపరింటెండెంట్ సుబ్బారావు అభినందించారు. రక్తనిధి కేంద్రం వైద్యాధికారి పీఎస్ శర్మ మాట్లాడుతూ అన్ని దానాల కంటే రక్తదానం గొప్పదన్నారు. తలసేమియా బాధిత చిన్నారులకు యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయాలన్నారు. తలసేమియా జన్యుపరమైన రక్త రుగ్మత వ్యాధి అని, చికిత్స అందకపోతే ప్రాణాంతకంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో కిమ్స్ కళాశాల వైద్యులు దివ్య జ్యోతి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలను కాపాడండి

ఉప్పలగుప్తం: రక్తదానంతో ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడాలని వేదాంత ప్లాంట్ ప్రతినిధి పాషా అన్నారు. ఎస్.యానం గ్రామంలో ఆయన ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇందులో సుమారు 40 మంది ప్లాంట్ ఉద్యోగులు పాల్గొని రక్తదానం చేశారు. అమలాపురం ఏరియా హాస్పిటల్ బ్లడ్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పూల అన్నపూర్ణ, ఇన్‌చార్జి దొడ్డ కాశీ, చెల్లింగి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ కంపెనీపై దాడులు

యానాం: గంధం చెక్కల నుంచి ఆయిల్ తీసే కంపెనీపై శుక్రవారం అటవీశాఖ అధికారులు దాడులు చేయడం సంచలనమైంది. విలియనూర్ సమీపంలో ఉలవైక్కల్ గ్రామంలో పుదుచ్చేరి వ్యవసాయ శాఖ మంత్రి తేనె జయకుమార్ కుమార్తె ప్రేమకు చెందిన ఆయిల్ కంపెనీ ఉంది. దానిని కేరళ రాష్ట్రానికి చెందిన నాజర్ అద్దెకు తీసుకుని ఇండో అగ్రో ఎసెన్షియల్ ఆయిల్ (బి) లిమిటెడ్ పేరుతో నడుపుతున్నారు. ఇక్కడ చందనం నుంచి నూనె తీస్తున్నారు. అయితే కొద్దిరోజుల క్రితం సేలం ప్రాంతంలో గంధం దుంగలను తరలిస్తున్న వాహనాన్ని అటవీశాఖ అధికారులు అడ్డుకుని విచారించారు. అయితే వాటిని పుదుచ్చేరి ఉలవైక్కల్ ప్రాంతంలో కంపెనీకి కేరళ నుంచి రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. ఎర్ర చందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్న నలుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 1.5 టన్నుల చందనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వారు ఇచ్చిన సమాచారం ఆధారంగా సేలం జిల్లా అటవీశాఖ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సురేష్, పుదుచ్చేరి అటవీశాఖ డీఎండీ ఫారెస్ట్ అధికారి, తహసీల్దార్ శేఖర్‌తో సహా 20 మందికి పైగా అధికారుల బృందం గురువారం అర్ధరాత్రి వేళ విలియనూర్‌లో భద్రపరిచిన చందనం దుంగలను తనిఖీ చేశారు. శాండిల్‌వుడ్ ఆయిల్ కంపెనీ వద్ద జరిపిన సోదాల్లో 40 కేజీల చొప్పున చందనం ఆరు బస్తాలు ఉన్నట్లు గుర్తించారు. దీంతో గొడౌన్‌కు తాళాలు వేశారు. శుక్రవారం అటవీశాఖ మళ్లీ తనిఖీలు చేపట్టి, వాటికి పోలీసు రక్షణ అవసరమని విలియనూర్ ఎస్పీ కార్యాలయానికి లేఖ అందించింది.

సాకారమైన హిమాన్షు శుక్లా రామసేతు వారధి

- రూ.1.01 కోట్లతో నిర్మాణం
- 15 రోజుల్లోనే పనులు పూర్తి



వాడ్రేవుపల్లి డ్రైన్‌పై నిర్మించిన హిమాన్షు శుక్లా రామసేతు వారధి

మామిడికుదురు: క్షణక్షణం, భయం, భయంగా మారి రైతులను తీవ్ర కలవర పాటుకు గురి చేసిన శిథిల వంతెన స్థానే పక్కా వారధి నిర్మాణం సాకారమైంది. రికార్డు స్థాయిలో రెండు నెలల వ్యవధిలోనే ఈ వారధి నిర్మాణం పూర్తి చేసి రికార్డు సృష్టించారు. వాడ్రేవుపల్లి మీడియం డ్రైన్‌పై పాశర్లపూడిలంక-లూటుకుర్రు గ్రామాల మధ్య రూ.1.01 కోట్ల వ్యయంతో ఈ వారధి నిర్మించారు. కలెక్టర్ కృషి ఫలితంగా నిర్మించిన ఈ వారధికి 'హిమాన్షు శుక్లా రామసేతు వారధి'గా నామకరణం చేశామని పీఆర్ డీఈఈ (ప్రాజెక్టు) అన్యం రాంబాబు శుక్రవారం తెలిపారు. కలెక్టర్ చొరవతోనే మామిడికుదురు శివారు కొర్లగుంట ఏటిగట్టు దిగువన అప్పనపల్లిలో పాటురేవు పాయపై వంతెన నిర్మించారు. దానికి సైతం 'శుక్లా వారధి'గా నామకరణం చేయడం విశేషం.

నిధుల మంజూరు ఇలా..

పాశర్లపూడిలంక, లూటుకుర్రు గ్రామాలతో పాటు మరో అయిదు గ్రామాలకు చెందిన ప్రజల అభ్యర్థన మేరకు కలెక్టర్ శుక్లా వారధి నిర్మాణం స్థితిగతులపై అధ్యయనం చేశారు. శిథిల వంతెన పరిస్థితిని స్వయంగా పరిశీలించి యుద్ధ ప్రాతిపదికన నిధులు మంజూరు చేశారు. ఎంపీ లాడ్స్ నుంచి రూ.25 లక్షలు, జిల్లా పరిషత్ ద్వారా రూ.35 లక్షలు, జిల్లా జనరల్ ఫండ్ నుంచి రూ.41.20 లక్షలు వంతెన నిర్మాణానికి మంజూరు చేశారు. 75 అడుగులు పొడవు, 25.6 అడుగులు వెడల్పుతో ఈ వారధి నిర్మించారు. ఈ వంతెన మీదుగా ఏడు గ్రామాలకు చెందిన సుమారు 15 వేల మంది రాకపోకలు సాగించేందుకు వీలు కలుగుతుంది. దీంతో పాటు భారీ వర్షాల సమయంలో వారధిపై భాగంలోని పంట పొలాలు ఇంత వరకు తీవ్రమైన ముంపు సమస్యను ఎదుర్కొన్నాయి. ఇక నుంచి ముంపు సమస్యకు విముక్తి కలుగుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.